పారిశుధ్య కార్మికుల ఆందోళన

నార్నూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నార్నూర్, మార్చి 5 : ప్రభుత్వం మూడు నెలలుగా వేతనం చెల్లించకపోవడంతో పంచాయతీల్లో పని చేసే పారిశుధ్య కార్మికులు బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేతనం చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనం అందించేలా చూడాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు బాపురావ్, సింధేగోపాల్, సురేందర్, సుధాకర్, కిరణ్, శ్రావణ్, సునీల్, శివాజీ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు శిక్షణ

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

మేస్త్రీలకు కిట్లు అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 5 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆయా గ్రామాల నుంచి ఎంపిక చేసిన మేస్త్రీలకు శిక్షణ ఇస్తున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు మేస్త్రీలకు ఇచ్చే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. బుధవారం ఆదిలాబాద్‌లోని జడ్పీ కార్యాలయంలో మేస్త్రీలకు కిట్లు అందజేశారు. అనంతరం శిక్షణ ఇస్తున్న న్యాక్ సిబ్బందికి మెమెంటోలు అందజేశారు. మేస్త్రీలతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి ముగ్గును పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ బసవేశ్వర్, న్యాక్ ఏడీ నాగేంద్ర, ఇన్‌స్ట్రక్టర్లు రమేశ్. మహేశ్, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఛాంబర్‌లో ఖాళీగా ఉన్న కుర్చీ

ఖాళీగా సందర్శనమిస్తున్న సిబ్బంది కుర్చీలు

అంత మా ఇష్టం..

నార్నూర్, మార్చి 5 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అంత మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఉదయం 10:50 గంటలు అవుతున్న మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీడీవోతో పాటు సంబంధిత సిబ్బంది విధులకు హాజరుకాలేదు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ఉదయం 11 గంటల సమయంలో ఎంపీడీవోతో పాటు సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులు సమయపాలన పాటిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పర్యవేక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

బోథ్, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. భూ తగదాలు, సివిల్, క్రిమినల్, బ్యాంకుకు సంబంధించిన కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

కొనసాగుతున్న విస్తృత ఉపన్యాసం

ఎదులాపురం, మార్చి 5 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్) హిందీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం కొనసాగుతున్నదని ప్రిన్సిపాల్ అతిక్ బేగం తెలిపారు. బుధవారం డిగ్రీ కళాశాల సైన్సెస్ చెందిన హిందీ అధ్యాపకురాలు రాధ హిందీ పాఠ్యాంశం రాసి (తిరిగి ప్రయాణం) ఉషా ప్రియా వంద రచించిన పాఠ్యాంశంను విద్యార్థులకు బోధించారు. అనంతరం రాధకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందినంచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, హిందీ విభాగం అధ్యాపకురాలు పీ పూనమ్ అనిత, సంతోషిని ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలపై ఉంది

ఎదులాపురం, మార్చి 5 : తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలపై ఉందని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్ దేశ్ పాండే అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చెర గ్రామంలో తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం 2007 సమాచార పుస్తకాలు పంపిణీ చేశారు. వయోవృద్ధుల సంక్షరణ, చట్టాల గురించి తెలియజేశారు. అనంతరం వయోవృద్ధులకు వేసవిలో ఉపయోపడేలా కాటన్ టవల్స్, పంచెలను అందజేసి సత్కరించారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం తనిఖీ

ఇంద్రవెల్లి, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఇంటర్మీడియట్ రెండు పరీక్షా కేంద్రాలను బుధవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు తాగునీరు, వైద్యంతో పాటు ఇతర విషయాలపై ఆరా తీశారు. ఆయన వెంట అధికారులు మెస్రం లక్ష్మణ్, పోలీసులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద, మార్చి 5: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద, తిర్పెల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 11:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ తెలిపారు. లక్ష్మణచాంద, తిర్పెల్లి గ్రామాల్లో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను అమర్చుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

సోన్, మార్చి 5: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని జాఫ్రాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం పామాయిల్ పంటను సందర్శించారు. సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులు పామాయిల్ సేద్యం, పంట దిగుబడి, మార్కెటింగ్, భవిష్యత్‌లో దాని లాభాల్లోకి ఎలా తీసుకెళ్లాలో అన్న విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేశ్‌కుమార్, విజయమాల, ఆసిఫ్‌అలీ, అనుపమ, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్, మార్చి 5: నిర్మల్ జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు, ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని డీఈవో రామారావు తెలిపారు. జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి తమ దరఖాస్తులను రెండు రకాల డిక్లరేషన్‌లో కలిసి కార్యాలయంలో అందించాలని సూచించారు.

విధుల్లో చేరిన ఆర్ఐలు

దస్తురాబాద్, మార్చి 5 : దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో బుధవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా రచన, ఆర్తీ విధుల్లో చేరారు .ఈ సందర్భంగా తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కి జాయినింగ్ లేటర్లు అందజేశారు. రచన భైంసా ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహించగా ఉద్యోగోన్నతిపై ఆర్ఐగా దస్తురాబాద్‌కు వచ్చారు. అలాగే ఆర్తీ నర్సాపూర్(జీ)లోని తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించగా ఉద్యోగోన్నతిపై ఆర్ఐగా దస్తురాబాద్‌కు వచ్చారు. బాధ్యతగా విధులు నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని తహసీల్దార్ వారికి సూచించారు.

తప్పుడు పత్రాలను అందజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇచ్చోడ, మార్చి 5 : ఎస్సీ కుల ధృవీకరణ తప్పుడు పత్రాలు అందజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సంఘం నాయకుడు రాథోడ్ భీంరావ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ట్రైకార్ అధికారులు, ఐటీడీఏ ఉట్నూర్ ఏపీవో జాదవ్ వసంత్, తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్, ఇచ్చోడ మాజీ ఎంపీటీసీ హన్ దేవానంద్ తండ్రి కిషన్ ఇంటి వద్ద తప్పుడు గిరిజన కుల ధృవీకరణ పత్రం ఏ విధంగా తీసుకున్నారని ప్రశ్నించారు. ఇంటి పక్కన ఉన్నవారిని దేవానంద్ కులం ఏమిటి, ఏ వృత్తి చేస్తారో విచారణ చేయడం జరిగిందన్నారు. సమగ్ర విచారణ జరిపి ఇచ్చోడ గ్రామ బంజారా కుల పెద్దల నిర్ణయం కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకోవాలని కుల సంఘం నాయకులు తెలిపారు. తప్పుడు వాగ్మూలం ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇతని కుల సర్టిఫికెట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంజారా నాయకుడు నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 5 : ఇంటి పన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో గృహ, వాణిజ్య పన్ను వసూలు, శానిటేషన్, అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో వాణిజ్య, గృహ పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వసూలు చేసిన పన్నుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేశ్‌కుమార్, జాదవ్‌కృష్ణ, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 5 : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిగ్రీ విద్యార్థినులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఆవశ్యకతను తెలిపేందుకు జిల్లాలోని పలువురు డిగ్రీ విద్యార్థినలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 22 నుంచి మార్చి 8 వరకు 45 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్ ప్రణాళిక, మహిళా సాధికారత, బేటీ పడావో బేటీ బచావో ప్రాముఖ్యతపై చర్చించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగలక్ష్మి, మిషన్ శక్తి బృంద సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుభీర్ : పరామర్శిస్తున్న కిరణ్ కొమ్రెవార్, నాయకులు

కుభీర్, మార్చి 5: నిర్మల్ జిల్లా కుభీర్‌కు చెందిన సూది గంగారాం, అక్రబీ, ప్యాట పోతన్న, సంతోష్ పటేల్, బెల్గాంతండాలో ఉల్లాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ కుభీర్, బాసర, కుంటాల మండలాల అధ్యక్షులు ఎన్నీల అనిల్, కోర్వశ్యాం, పడకంటి దత్తు, నాయకులు, ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

బోథ్, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా సొనాలకు చెందిన షేక్ ఇసాక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో, కొండమడుగు శంకర్, ఆడప శంకర్ తల్లులు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఇంద్రవెల్లి, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ చౌహాన్ కిశోర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి వారి స్వగ్రామమైన ఉట్నూర్ మండలంలోని జైత్రంతండాకు వెళ్లి పరామర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎదులాపురం, మార్చి 5 : ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. మహిళా సైబర్ జాగృతి దినోత్సవం సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు ,వేధింపులు అనే అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆదిలాబాద్‌లో జరుగుతున్న వివిధ సైబర్ నేరాల గురించి వివరంగా వివరించారు. కార్యక్రమంలో సీఐ బీ సునీల్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతిక్‌బేగం, ఐటీ కోర్ రియాజ్, షీటీం ఏఎస్ఐ సునీత పాల్గొన్నారు.

ఎదులాపురం: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ హసీబుల్లా

ఇంద్రవెల్లి, మార్చి 5: విద్యార్థులతో పాటు మండల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సునీల్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానితులు కాల్ చేసి బ్యాంక్ వివరాలతో పాటు వ్యక్తిగత వివరాలు అడిగితే తెలియజేయవద్దని అన్నారు. ఫోన్ల ద్వారా ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, ఈకేవైసీ అప్‌డేట్ చేయాలని అడిగిన వారికి ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత వివరాలు అందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు పోలీసులుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ అండ్‌బీ డీఈఈ ఇంట్లో చోరీకి విఫలయత్నం

భైంసా, మార్చి 5 : నిర్మల్ జిల్లా భైంసాలోని సాయికాటన్ ఏరియాలో అద్దె ఇంట్లో ఉంటున్న ఆర్ అండ్ బీ డీఈఈ సునీల్ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయికాటన్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భైంసా ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్ మంగళవారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఇంటి తాళం తెరిచి ఉండడం గమనించిన స్థానికులు ఆయనకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన చేరుకొని పరిశీలించగా బీరువా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అనంతరం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇంట్లో విలువైన వస్తువులు, నగదు లేవని ఆయన చెప్పారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల, మార్చి 5 : బీఆర్ఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కుంటాలలో పార్టీ మండలాధ్యక్షుడు పడకంటి దత్తు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దశరథ్, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఖదీర్, నాయకులు వంశీ, రమేశ్, శ్రీనివాస్ రావు, గంగన్న, అశోక్, బాలాజీ, సాయిరాజ్, గజేందర్, సాయి, కృష్ణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

నర్సాపూర్(జీ), మార్చి 5 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని బూర్గుపల్లి హనుమాన్ తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ దినేశ్‌కు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మంటలను ఇరుగు పొరుగు నీటితో ఆర్పారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలు అదుపు చేశారు. రూ. 4 లక్షల 50 వేల నగదు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వెల్లడించారు. తగు చర్యలు నిమిత్తం దినేశ్ దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

ఉట్నూర్ రూరల్, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన పంద్ర గంగాధర్ ఇల్లు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన అనంతరం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామ ప్రజలు నీటిని పోసి మంటలు ఆర్పారు. మంటలు ఆర్పేలోపు ఇల్లు మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.60వేల నగదు, 2 క్వింటాళ్ల పత్తి, ఇతర ఇంటి సామగ్రి కాలిపోయిందని బాధితుడు పేర్కొన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

విష ప్రయోగంతో కోళ్లు మృతి

భైంసాటౌన్, మార్చి 5 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్‌లో పునేందర్‌కు చెందిన కోళ్ల ఫారంలో బుధవారం దుండగులు వాటర్ ట్యాంక్‌లో విషాన్ని కలపడంతో 1000 వరకు కోళ్లు మృతి చెందాయి. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నైలు, పశువైద్యాధికారి విఠల్ ఫారం వద్దకు చేరుకుని మరణించిన కోళ్లను పరీక్షించారు. విష ప్రయోగ నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపించినట్టు తెలిపారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక కోళ్ల మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. దాదాపు ఐదు లక్షల వరకు నష్టం జరిగిందని కోళ్ల యజమాని వెల్లడించారు. సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.9.9 లక్షల బకాయిలు..26 దుకాణాలు సీజ్

నిర్మల్ అర్బన్, మార్చి 5 : నిర్మల్‌లోని క్లబ్ కాంప్లెక్స్ సొసైటీలోని 26 దుకాణాలను బుధవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా మున్సిపాల్టీకి ట్యాక్స్ చెల్లించకపోవడంతో బకాయిలు రూ.9.90 లక్షలకు చేరుకున్నాయని రెడ్ నోటీసులు జారీ చేసిన పన్నులు కట్టకపోవడంతో ఆ కాంప్లెక్స్‌లోని దుకాణాలను సీజ్ చేసినట్లు ఆర్ఐ అనూఫ్ తెలిపారు.

ఎన్యూమరేషన్ అందించాలి

బోథ్, మార్చి 5 : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న వారికి ఎన్యూమరేషన్, డ్యూటీ సర్టిఫికెట్ అందించాలని కోరుతూ బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఎంపీడీవో రమేశ్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గౌరవ భృతితోపాటు డ్యూటీ సర్టిఫికెట్ అందించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పీఆర్టీయూ టీఎస్ బోథ్ శాఖ అధ్యక్షుడు ఆర్‌టీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బిక్క గంగయ్య రవిరాజ్, రంజిత్ ఉన్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్ టౌన్, మార్చి 5: మేర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ భవనంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సింగు లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా రాజులదేవి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా రామగిరి నరేందర్, కోశాధికారిగా రాజులదేవి గణేశ్, ప్రధాన కార్యదర్శిగా కొడిగంటి నర్సయ్య, ముఖ్య సలహాదారులుగా సింగు రవి, నరేశ్, నర్సయ్య, రాజేశ్వర్, భూమేశ్వర్‌ను ఎన్నుకున్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

బజార్‌హత్నూర్, మార్చి 5: ఆదిలాబాద్ కలెక్టర్ ఆదేశాల మేరకు బజార్‌హత్నూర్ మండలంలోని డేడ్రా, మాన్కపూర్, గిరిజాయి గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి బుధవారం తహసీల్దార్ శ్యాంసుందర్‌తో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులు ప్రమోద్, రమేశ్, శ్రీనివాస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ అధికారి ప్రమోద్ మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో టవర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు.అతి త్వరలోనే టవర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఆర్ఐ నూర్‌సింగ్, ఎంపీ బాపురావ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతగా దస్తురాబాద్ జట్టు

దస్తురాబాద్, మార్చి 5 : దేవునిగూడెం గ్రామంలో యూత్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దస్తురాబాద్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ. 12 వేలు, రన్నర్ జట్టుకు రూ 6 వేలను పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు వెంకన్న అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, లక్ష్మణ్, నరేశ్, గంగన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్, ఫుడ్ ఫెస్టివల్

బేల, మార్చి 5 : బాది గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్, సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ హెచ్ఎం మహాలక్ష్మి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టీఎన్ స్వామి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మహిళ మృతి

సోన్, మార్చి 5: నిర్మల్ జిల్లా సోన్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన రుసుంకుంటే లక్ష్మీబాయి(54) మంగళవారం సరస్వతి కెనాల్‌లో చేపల పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ హైమద్ మొహినుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీబాయి మంగళవారం మధ్యాహ్నం సరస్వతి కెనాల్ ఒడ్డు మీద నుంచి చిన్న చిన్న చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. గమనించిన స్థానికులు పడిపోయిన లక్ష్మీబాయిని కెనాల్‌లో వెతుకుతుండగా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం జాలర్లు వెతుకుతుండగా మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు..



ఇంగోలే విలాస్(ఫైల్)

ఇచ్చోడ, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని తుమ్మల్‌పాడ్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంగోలే నాగోరావ్ – కుస్మాబాయి దంపతుల రెండో కుమారుడు ఇంగోలే విలాస్(28) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ సరఫరా అయి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాంనాయక్ తెలిపారు.

అడవి పందుల దాడిలో ఇద్దరికి గాయాలు

పెంబి, మార్చి 5: అడవి పందుల దాడిలో ఇద్దరి రైతుల గాయాలైన ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలం సక్కిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..సక్కిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నాతమ్ముళ్లు సిడాం లక్ష్మణ్, తుకారాం మంగళవారం అర్ధరాత్రి పంట కాపాలకు ఎడ్ల బండిపై వెళ్లారు. సక్కిగూడ గ్రామ శివారులో అడవి పందుల గుంపు ఎద్దుల బండికి ఎదురుపడి దాడి చేశాయి. ఎడ్లబండి అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి కాళ్లు విరిగిపోయాయి. అంబులెన్స్‌లోఈఎంటీ కృష్ణ ప్రాథమిక చికిత్స అందించి నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బోథ్ బస్టాండ్‌లో ప్రహరీ నిర్మాణ పనులు

బోథ్, మార్చి 5 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ బస్టాండ్ వద్ద ప్రహరీ నిర్మాణ పనులను ఆర్టీసీ అధికారులు బుధవారం ప్రారంభించారు. ఆర్టీసీ విభాగం డీఈ ఆంజనేయులు బస్టాండ్ చుట్టు కొలతలు తీశారు. మార్క్ అవుట్ ఇచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో పునాది తవ్వక పనులు మొదలుపెట్టించారు. బస్టాండ్ వెనుక భాగంలో కొలతలు సేకరించి మార్క్ అవుట్ ఇస్తున్న సమయంలో ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు రాజు యాదవ్, సుభాష్ అక్కడికి వెళ్లి డీఈతో మాట్లాడారు. గతంలో ఇటు వైపు నుంచి బస్సు తిరిగేందుకు వీలుగా స్థలం ఉండేదని డీఈ దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్ అనుకొని ప్రహరీ నిర్మిస్తే బస్సులు తిరగడానికి వీలు లేకుండా పోతుందన్నారు. పాత రికార్డులు పరిశీలించి వెనుక భాగంలో ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డీఈని కోరారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అనిల్, శరణ్య దీపిక, శ్రీయ, శ్రీధర్ డాక్టర్ జే అనిత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ మార్గదర్శకత్వంలో మండలంలోని ఐదు గిరిజన గ్రామాలను ఎంపిక చేసుకుని 'గిరిజన మహిళల్లో డిజిటల్ లావాదేవీల ప్రభావం' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. బుధవారం ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నాంపల్లిలో ప్రదర్శించి జేడీ రాజేందర్ సింగ్, ఆర్‌జేడీ యాదగిరి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఏర్పడిన రెండవ సంవత్సరంలోనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి వరకు వెళ్లడం అభినందనీయమన్నారు. జిజ్ఞాస కో–ఆర్డినేటర్ డాక్టర్ మధు, అధ్యాపకులు పర్యవేక్షకురాలు అనితను, విద్యార్థులను అభినందించారు.

గోదావరిలో మునిగి ఒకరి మృతి

బాసర, మార్చి 5 : గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం నిర్మల్ జిల్లా బాసరలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర మండలంలోని బిదిరెల్లి గ్రామానికి చెందిన డోన్‌గాలే మారుతి(34) కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగ్‌రాజ్‌తో పాటు ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించుకొని తిరుగు ప్రయాణంలో బాసర గోదావరి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలి

ఎదులాపురం, మార్చి 5 : బజార్‌హత్నూర్ మండలం మోడల్ స్కూల్, కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పిక్నిక్ వెళ్లారు. అక్కడ విద్యార్థులతో అసభ్యకరమైన ప్రవర్తనతో తీసిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని వెంటనే ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి టీ ప్రణీతకు వినతిపత్రం అందజేశారు.

రైలు నుంచి జారిపడిన యువకుడికి గాయాలు

బాసర, మార్చి 5 : రైలు నుంచి జారిపడిన యువకుడికి గాయాలైన ఘటన బుధవారం నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి రాజ్‌కోట్ వెళ్లే రైలులో ప్రమాదశాత్తు రైలు దిగే క్రమంలో కాలుజారి పడి కామారెడ్డికి చెందిన కృష్ణసాయి(30) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న జీఆర్పీ పోలీసులు వెంటనే స్పందించి ప్రయాణికులతో సహాయంతో క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

కడెం, మార్చి 5 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని చిట్యాల గొండుగూడ గ్రామానికి చెందిన పందిరి జలపతి (56) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జలపతి పొలం పనుల నిమిత్తం, తనకు సంబంధించిన పశువులకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అనంతరం స్నానానికి వెళ్లిన ఆయన కాలు జారి గోదావరిలో పడిపోయాడు. ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. జలపతి భార్య పందిరి సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం

ఖానాపూర్, మార్చి 5: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని శివాజీనగర్ కాలనీకి చెందిన ఆమంద కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కాలనీకి చెందిన పలువురు ప్రముఖులు పరామర్శించి రూ. 16 వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఇక్కడ ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు రాజగంగన్న, సూర్యప్రకాశ్, సుమన్, వెంకట్‌మహేంద్ర ఉన్నారు.